క్లుప్తంగా

తీగజాతి చెట్టును తొలగించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారు ప్రాంతంలో ముల్కనూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ రైతుకు చెందిన వ్యవసాయబావి వద్ద విద్యుత్ పోల్ సపోర్ట్ వైరుకు పాకిన తీగజాతి చెట్టు కొమ్మలు పాకి ప్రమాదంగా ఉంది. ఈ కథనంపై 'ముట్టుకుంటే ప్రమాదమే' అనే శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైంది. కథనంపై స్పందించిన విద్యుత్ అధికారులు తీగజాతి చెట్టు కొమ్మలను వెంటనే తొలగించారు. దీంతో ఆ ప్రాంత రైతులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం



కమలాపూర్: చిన్నతనంలో తమతో చదువుకున్న మిత్రుడికి ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు 1992–93 పదో తరగతి బ్యాచ్ మిత్రులు. కమలాపూర్‌కు చెందిన జడల రమేశ్ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అతని ఆర్థిక పరిస్థితి బాగా లేదని తెలుసుకున్న చిన్ననాటి మిత్రులంతా కలిసి ఆదివారం రమేశ్‌కు రూ.35 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. అందజేసిన వారిలో ఆడెపు మహేందర్, కూనూరు రంజిత్‌కుమార్‌గౌడ్, మోహన్, వడ్డె రమేశ్, ఈగ శ్రీనివాస్, మేడిపెల్లి రాములు, తుమ్మ రాజేందర్, కుమార్, దాసరి రమేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సదస్సుకు తరలిన న్యాయవాదులు



వరంగల్ లీగల్: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సుకు వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు తరలివెళ్లారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల జీవన్ గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లడే రమేష్, ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకుడు సాయిని నరేందర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీసీ కుల జనగణన, న్యాయ వ్యవస్థలో జనాభా దామాషా ప్రకారం వాటా, మహిళా బిల్లులో బీసీ కోటా, చట్ట సభల్లో వాటా లాంటి ముఖ్యమైన అంశాల అజెండాతో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు న్యాయవాదులు దయాల సుధాకర్, విజేందర్, శ్యామ్, విక్రమ్, కూనూరు రంజిత్‌గౌడ్, సుందర్‌రామ్, సత్యనారాయణ రెడ్డి, సురేందర్, గట్టు రవి, సాజిత్, ముకుందరావు, రాజ్‌కుమార్, పిల్లి కార్తీక్, అనిల్, పండగ శ్రీనివాస్, రామనాథం, తదితరులు వెళ్లారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



న్యూశాయంపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండ ములుగురోడ్డు ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో మైనార్టీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లతో పాటు కుట్టుమిషన్లను ఆదివారం అందజేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడారు. మహిళలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్ధిఖీ, మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాయిద్ మసూద్, అజీజ్‌బేగ్, ఎంఏ కలీం, సయ్యద్ అక్బర్, మాషూఖ్ రబ్బానీ, నుస్రత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలు

పరకాల, వేలేరు, దామెర మండకేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో శ్రావణమాసం సందర్భంగా పోచమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి బయలుదేరారు. బెల్లంతో తయారు చేసిన బోనాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారికి బోనం, చీరె సారె, పసుపు, కుంకుమ సమర్పించారు. ఆయా గ్రామాల్లోని ప్రముఖులు బోనాల వేడుకలో పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



పరకాలలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు



వేలేరులో..



పరకాలలో పూజలు చేస్తున్న భక్తులు



వేలేరు : పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారిలో కమలాపూర్ నుంచి ఉప్పల్‌కు వెళ్లే మార్గంలో ఉప్పల్ శివారులో రోడ్డు పక్కనే ఉన్న ఓ వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. దగ్గరకు వెళ్తే తప్ప ఆ బావి ఉందని తెలియని పరిస్థితి. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణించినా ఆ బావిలో పడిపోవడం ఖాయం. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే వ్యవసాయ బావి వద్ద రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– కమలాపూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : జయశ్రీ, ఏఈ, ఆర్అండ్‌బీ
ఫోన్‌నంబర్: 98661 66729

ప్రోత్సాహక బహుమతుల ప్రదానం



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి చేతుల మీదుగా సంఘం సభ్యుల పిల్లలు ఉన్నత చదువుల కోసం ఆదివారం బ్యాంకు ఆవరణలో ప్రోత్సాహక బహుమతుల చెక్కులు అందజేశారు. (మెడిసిన్, డెంటల్, ఫార్మా డి చదివే విద్యార్థులకు రూ.20వేలు, ఇంజనీరింగ్, బీ ఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్/హార్టికల్చర్/నర్సింగ్ చేసే విద్యార్థులకు రూ.15వేల చొప్పున మొత్తం 82 మంది విద్యార్థులకు రూ.12,50,000 లు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని 2008లో ప్రారంభించి, అప్పటి నుంచి 2023 వరకు 1,218 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.1,01,43,500లు పంపిణీ చేసినట్లు వెల్లడించా రు. కార్యక్రమంలో సంఘం జనరల్ మేనేజర్ రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కడారి ఆదామ్, సంఘం కార్యవర్గ సభ్యులు భాగ్య, కనుకయ్య, జయపాల్‌రెడ్డి, రాములు, వీరయ్య, కనుకమ్మ, రవీందర్‌రెడ్డి, మూగయ్య, మహేందర్, శ్రీనివాస్, బుచ్చయ్య, బాషు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ

- ఇంటింటి సర్వే చేపట్టనున్న టీం సభ్యులు
- మూడు విడతల్లో నిర్వహించనున్న గ్రామసభలు



శాయంపేటలో సర్వే నిర్వహిస్తున్న ఎస్ఆర్పీలు

శాయంపేట : మండలంలోని 24 గ్రామాల్లో ఏప్రిల్ 1, 2023 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకంలో రూ. 3.97 కోట్ల నిధులతో చేపట్టిన ఉపాధి పనులపై 15వ సామాజిక తనిఖీ చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో జరిగిన చెరువు పనులు, నర్సరీ మొక్కల పెంపకం, ఫీడర్ చానల్స్, ఓపెన్ వెల్, సీసీ రోడ్లు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీరాజ్ శాఖలో జరిగిన సీసీ రోడ్లు, శ్మశాన వాటికలు, పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన హరితవనం ప్లాంటేషన్ పనులపై సామాజిక తనిఖీ సభ్యులు తనిఖీ చేస్తున్నారు. మండలంలోని 24 గ్రామాలను మూడు విడతల్లో ఇంటింటి సర్వే చేపట్టి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్పీలు నాగరాజు, రజిత ఆదివారం తెలిపారు. మొదటి విడతలో ఈ నెల 28న కాట్రపల్లి, గోవిందాపూర్, మాందారిపేట, వసంతాపూర్, మైలారం గ్రామాల్లో సర్వే చేపట్టి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న పెద్దకోడెపాక, కొప్పుల గ్రామాల్లో, 30న శాయంపేటలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో విడతలో ఈ నెల 31న ప్రగతి సింగారం, సూర్యనాయక్ తండాలో, సెప్టెంబర్ 1న హుస్సేన్‌పల్లి, పత్తిపాక, నేరేడుపల్లి, గట్లకానిపర్తి, గంగిరేణిగూడెం, జోగంపల్లి గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలి పారు. మూడో విడతలో సెప్టెంబర్ 3న రాజుపల్లి, కొత్తగట్టు సింగారం, నూర్జహాన్‌పల్లి, సూరంపేట, నర్సింహులపల్లి, సాధోనిపల్లి, ఆరెపల్లి, అప్పయ్యపల్లి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామసభలు పూర్తయ్యాక అధికారుల ఆదేశానుసారం మండల కేంద్రంలో ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు తెలిపారు. 8 సామాజిక టీం బృందాలు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు ఎస్ఆర్పీలు తెలిపారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్‌రావుకు తెలంగాణ సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన దైవాజ్ఞ శర్మ డాక్టరేట్ బిరుదును ప్రదానం చేశారు. ఆధ్యాత్మిక సేవా రంగంలో విశేష సేవచేస్తున్నందుకు నాగేశ్వర్‌రావును సత్కరించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచవరం గౌరిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాల్లో ట్రస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ తనకు డాక్టరేట్ బిరుదును ప్రదానం చేయడం గర్వంగా ఉందన్నారు. ట్రస్ట్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



ఎల్కతుర్తి : బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు

ఎల్కతుర్తి: బీసీ రిజర్వేషన్ల పితామహుడు, వెనుకబడిన తరగతుల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త బిందేశ్వరి ప్రసాద్(బీపీ)మండల్ జయంతి వేడుకలను ఆదివారం భీమదేవపల్లి మండలం ముల్కనూర్‌లోని అంబేడ్కర్ చౌక్‌వద్ద బీసీ, ఎస్సీ కుల సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రసాద్ మండల్ బిహార్ రాష్ట్రంలో సంపన్న యాదవ జమీందార్ కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివి బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరికతో బీసీలకు రావల్సిన రిజర్వేషన్లు ఇవ్వాలని 1952లో బిహార్ శాసనసభకు ఎన్నికయ్యారన్నారు. రాజ్యాంగ రక్షణ ఫలాలను బీసీలకు దక్కాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించి గర్జించి కేంద్రంలో 27 శాతం రిజర్వేషన్లు సాధించిన పితామహుడని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. మాజీ జెడ్పీటీసీ వంగ రవీందర్, నాయకులు కొలుగూరి రాజు, రవీందర్, డ్యాగల సారయ్య, ప్రకాష్, సదానందం, భిక్షపతి, వెంకటస్వామి, స్వరూప, సుధాకర్, సురేష్ పాల్గొన్నారు.

అడ్‌హక్ పదోన్నతి చట్టవిరుద్ధం



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యుత్ బీసీ ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ సంస్థలు ఇటీవల కల్పించిన అడ్‌హక్ పదోన్నతి చట్టవిరుద్ధమని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి అన్నారు. హనుమకొండలో తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతిని ఆదివారం జరుపుకున్నారు. మండల్ చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, న్యాయస్థానాల తీర్పులకు వ్యతిరేకంగా అడ్‌హక్ పదోన్నతి కల్పించారని విమర్శించారు. వాటిని కోర్టులో సవాల్ చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 4న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో బీసీ, ఓసీ ఉద్యోగులందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతులను మభ్యపెట్టడానికి ఆరోపణలు



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్

ఆత్మకూరు: రైతులను మభ్యపెట్టడానికి రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి రుణమాఫీపై కట్టుకథలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం రుణమాఫీ విషయంలో స్పష్టంగా ఉందన్నారు. రూ.2 లక్షల లోపు ఉన్న ప్రతి రైతు రుణాన్ని మాఫీ చేస్తారని అన్నారు. ఆత్మకూరు సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి తనపై అసత్యపు ఆరోపణలు చేశారని అవి సత్యదూరమని అన్నారు. తాను రైతుల రుణాలపై చర్చకు సిద్ధమని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, రేవూరి జయపాల్‌రెడ్డి, ఉడుత మహేందర్, కక్కెర్ల రాజు, ఉడుత మహేందర్, అర్షం అశోక్, వెల్దె వెంకటేశ్వర్లు, అలువాల రవి, బోరిగం స్వామి, రాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



శాయంపేట : పరకాల–హనుమకొండ నేషనల్ హైవే మండలంలోని మాందారిపేట, కొత్తగట్టు సింగారం గ్రామాల శివారులోని స్టేజి సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఆదివారం పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, శాయంపేట సీఐ రంజిత్‌రావు సందర్శించి గుంతలను పరిశీలించారు. ప్రమాదాల నివారణ కోసం స్థానిక క్రషర్ల యాజమానులతో మాట్లాడి డస్ట్‌తో కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు రాజుతో గుంతలను పూడ్చివేయించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చర్యలు చేపట్టినట్లు సీఐ రంజిత్‌రావు తెలిపారు.

'హైడ్రా' పేరుతో కక్ష సాధింపు రాజకీయాలు



మాట్లాడుతున్న మండల యూత్ అధ్యక్షుడు సురేశ్

వేలేరు : హైడ్రా పేరుతో ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలు చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గోవింద సురేశ్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షల రుణమాఫీని అందరికి చేయకపోవడంతో రైతులు ప్రభుత్వంపై తిరగబడే అవకాశం ఉండటంతో రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించి హైడ్రా పేరుతో అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీలో అక్రమకట్టడాలు ఉన్నాయని నోటీసులు పంపడం సిగ్గుచేటని అన్నారు. ఎంతో మంది పేదవిద్యార్థులకు తన యూనివర్సిటీ ద్వారా ఉచితంగా విద్యనందిస్తూ వారు జీవితంలో ఉన్నత స్థానానికి ఎదిగేందుకు ఆయన కృషి చేస్తున్నాడని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడనే పల్లాపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు.

చీరల పంపిణీ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలో సీపీఐ నాయకురాలు తోట చంద్రకళ ఆమె కుమారుడు సతీష్ జ్ఞాపకార్థం స్థానిక పేద మహిళలకు ఆదివారం చీరెలు, టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సతీష్ మృతి చెంది ఏడాది గడచిన నేపథ్యంలో పేద మహిళలకు 220 చీరెలు, టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శంకరయ్య, రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లం శంకర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, నిమ్మల రమేశ్, రేణికుంట్ల సదయ్య, జిన్నా రాజేందర్, సాదు నాగరాజు, మారెపల్లి కట్టయ్య, వలిహైదర్, సదానందం ఉన్నారు.

ఆటో డ్రైవర్ల డిమాండ్లు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

నయీంనగర్: మహాలక్ష్మి పథకం కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 6లక్షల ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ప్రతిఏటా రూ.20 వేల చొప్పున ప్రకటించాలని, వారి సంక్షేమం కోసం రూ.వేయి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఐక్యంగా తమ హక్కుల సాధనకు పార్టీలు, కులాలు, మతాలు, యూనియన్లకు అతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఐఎఫ్‌టీయూ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.హబీబ్, జెరిపోతుల కుమార్, పలు జిల్లాల ఆటో యూనియన్ల అధ్యక్షులు రాజ్‌కుమార్, విద్యాసాగర్, దార మధు, చల్ల విక్రమ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు సన్మానం



నారాయణను సన్మానిస్తున్న యూనియన్ నేతలు

హన్మకొండ: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణను తెలంగాణ పర్యాటక సంస్థ తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సన్మానించారు. హనుమ కొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నారాయణకు హరిత హోటల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, తెలంగాణ పర్యాటక సంస్థ తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబశివ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. హరిత హోటల్ ఉద్యోగులు అజయ్, శ్రీను, సదానందం పాల్గొన్నారు.